సాక్షి
అనంతపురం
సోమవారం । 5 । ఆగస్టు । 2024



ఆకట్టుకున్న మణి దీపాలు..
ప్రశాంతి నిలయంలో తూర్పుగోదావరి జిల్లా భక్తులు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. 8లో



టమాట కిలో రూ.23
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.23 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.14 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/ 24.4°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నిండుకుండలా తుంగభద్ర జలాశయం


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్‌: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీరు అందించే తుంగభద్ర జలాశయం నిండుకుండలా మారింది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం సాయంత్రం నాటికి 1,32,202 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. దీంతో డ్యాం 29 క్రస్ట్‌ గేట్లు ఎత్తి 1,18,664 క్యూసెక్కుల నీటిని నదికి వదులుతున్నారు. జలాశయం పూర్తి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 99.040 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 1,633 అడుగుల నీటి మట్టానికి గాను 1,631.31 అడుగులకు నీరు చేరింది. మరోవైపు, హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105వ కిలోమీటర్‌ వద్ద 1,340 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఏసీఏ తాత్కాలిక కమిటీలో ఫెర్రర్‌కు చోటు



అనంతపురం: ఆంధ్రా క్రికెట్‌ అసోసియేషన్‌ (ఏసీఏ) తాత్కాలిక కమిటీలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్‌ మాంఛో ఫెర్రర్‌కు చోటు దక్కింది. ఏసీఏ నూతన కార్యవర్గ ఎన్నికలు సెప్టెంబర్‌లో జరగనున్నాయి. అప్పటి వరకు అసోసియేషన్‌ కార్యకలాపాల నిర్వహణ కోసం తాత్కాలికంగా కమిటీని ఏర్పాటు చేశారు. మొత్తం ముగ్గురు సభ్యులుగా ఉండే ఈ కమిటీలో మాంఛో ఫెర్రర్‌కు స్థానం కల్పించారు.

రైల్వేస్టేషన్‌లో చోరీ యత్నం

కంబదూరు: మండలంలోని కదిరిదేవరపల్లి రైల్వేస్టేషన్‌లో చోరీ యత్నం జరిగింది. రైల్వేస్టేషన్‌లో రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ పనులకు సంబంధించి ఐరన్‌, ఇతర సామగ్రిని భారీగా డంప్‌ చేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి కొందరు దుండగులు ఇనుప సామగ్రిని ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా సిబ్బంది అప్రమత్తమై కేకలు వేశారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్‌ ద్వారా సమాచారం అందుకున్న కంబదూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, చోరీ యత్నం వెనుక టీడీపీ నేత కుమారుడి హస్తం ఉన్నట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. గతంలోనూ సదరు టీడీపీ నేత కుమారుడు రైల్వేస్టేషన్‌లోని బ్యాటరీలు, డోర్లు ఇతర రూ.లక్షల విలువైన సామగ్రిని అపహరించుకెళ్లాడని ఈ సందర్భంగా గుసగుసలు వినిపించాయి.

జేఎన్‌టీయూలో విద్యార్థుల ఘర్షణ

- విద్యార్థికి గాయాలు

అనంతపురం: జేఎన్‌టీయూలో శనివారం రాత్రి విద్యార్థులు ఘర్షణ పడ్డారు. గొడవలో ఒక విద్యార్థికి గాయాలయ్యాయి. వివరాలు.. వర్సిటీ ఇంజినీరింగ్‌ కళాశాలలో మెకానికల్‌ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులను నాలుగో సంవత్సరం విద్యార్థులు తమ హాస్టల్‌ వద్దకు రమ్మన్నారు. ఒక గదిలోని వారు తప్ప మిగిలిన వారంతా వెళ్లారు. ఈ క్రమంలో తాము పిలిచినా ఎందుకు రాలేదని నాలుగో సంవత్సరం విద్యార్థులు గొడవకు దిగారు. మాటామాట పెరిగి భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ విషయంపై వర్సిటీలో రెండో సంవత్సరం చదువుతున్న ఓ కానిస్టేబుల్‌ కుమారుడు తన తండ్రికి సమాచారం ఇచ్చారు. ఆయన డయల్‌ -100కు ఫోన్‌ చేయడంతో ముగ్గురు కానిస్టేబుళ్లు వచ్చారు. అయితే, అనుమతి లేకుండా క్యాంపస్‌లోకి ఎలా ప్రవేశిస్తారని కానిస్టేబుళ్లను కళాశాల అధికారులు నిలదీశారు. డయల్‌- 100కు సమాచారమిస్తే వచ్చామని, విద్యార్థులు గొడవ పడుతున్నా పట్టించుకోరా అని కానిస్టేబుళ్లు అధికారులకు సమాధానం ఇచ్చారు. విషయం తెలుసుకున్న కళాశాల ఉన్నతాధికారులు విచారణ కమిటీని నియమించారు. కమిటీ సోమవారం సమావేశమై తదుపరి చర్యలు తీసుకోనుంది.

ఎలుగుబంటి సంచారం


కూడేరు సమీపంలో సంచరిస్తున్న భల్లూకం

కూడేరు: మండల కేంద్రం సమీపంలో ఆదివారం ఉదయం ఓ ఎలుగుబంటి సంచరించింది. అరవకూరు మార్గంలో పశువులను మేత కోసం తోలుకెళ్లిన కాపరులు ఎలుగు బంటిని గమనించగానే పెద్దగా శబ్దాలు చేశారు. దీంతో బెదిరి సమీపంలోని అటవీ ప్రాంతంలోకి పరుగు దీసింది. విషయం తెలుసుకున్న కూడేరు వాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

- నార్పల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 854 మంది విద్యార్థినులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సబ్జెక్టులకు 35 మంది టీచర్లు అవసరం. కానీ స్కూల్‌కు మంజూరైన పోస్టులు 26 మాత్రమే. ఇందులోనూ స్కూల్‌లో నేడు పని చేస్తోంది కేవలం 15 మందే. ఇంకా 21 పోస్టులు కావాలి. దీంతో ఉన్న టీచర్లపై పనిభారం పడుతోంది. ఫిజికల్‌ సైన్స్‌ టీచర్లు ఐదుగురు అవసరం కాగా ఒక్కరూ లేరు. అలాగే బయాలాజికల్‌ సైన్స్‌ టీచర్లు ఐదుగురు అవసరం కాగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఇదే విషయంపై ఇటీవల హెచ్‌ఎం, మండల విద్యాశాఖ అధికారి, తహసీల్దార్‌ ముగ్గురూ కలిసి ఎమ్మెల్యేకు లేఖ రాశారు. జిల్లా అధికారులకు విన్నవించారు.
- రాయదుర్గం పట్టణం, రూరల్‌ మండల పరిధిలో మొత్తం 81 పాఠశాలలున్నాయి. స్టూడెంట్‌ కిట్‌లో బ్యాగులు, బూట్లు, బెల్టులు, పాఠ్య పుస్తకాలు, నోట్‌ పుస్తకాలు ఇచ్చారు. యూనిఫాం, డిక్షనరీలు ఇవ్వలేదు. రాయదుర్గం మునిసిపల్‌ అభ్యుదయ హైస్కూల్‌లో టీచర్ల కొరత తీవ్రంగా ఉంది. 291 మంది విద్యార్థులుండగా, 16 టీచర్‌ పోస్టులు అవసరం. రెగ్యులర్‌ టీచరు ఒక్కరూ లేరు. ఇతర పాఠశాలల నుంచి ముగ్గురిని సర్దుబాటు చేసి నెట్టుకొస్తున్నారు.
- ఉరవకొండ పట్టణంలోని ప్రభుత్వ పడమర ప్రాథమిక పాఠశాలలో 9 మంది విద్యార్థులున్నారు. వీరిలో రోజూ 5–6 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతున్నారు. ఇద్దరు టీచర్లు పని చేస్తున్నారు.
- అనంతపురం రూరల్‌ మండలం పాపంపేట జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టూడెంట్‌ కిట్లకు సంబంధించి ఇప్పటిదాకా కేవలం బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్‌ పుస్తకాలు ఇచ్చారు. కిట్‌లో భాగంగా తక్కిన వస్తువులు ఎప్పుడిస్తారో తెలీదు.



1,721 జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు
2,17,170 విద్యార్థుల సంఖ్య

ఆదరణ కరువు.. అటకెక్కుతున్న చదువు

- పేద పిల్లలపై ప్రభుత్వం చిన్నచూపు
- స్కూళ్లు తెరిచి రెండు నెలలవుతున్నా అరకొరగానే 'స్టూడెంట్‌ కిట్లు'
- టీచర్ల కొరతతో కుదేలవుతున్న పాఠశాలలు
- గతంలో జరిగిన అత్యవసర బదిలీలను కక్షపూరితంగా రద్దు చేసిన ప్రభుత్వం
- చదువు చెప్పే వారు లేక సతమతమవుతున్న విద్యార్థులు
- తీసికట్టుగా మధ్యాహ్న భోజన నాణ్యత
- ఎవరికీ పట్టని ప్రభుత్వ పాఠశాలల గోడు



నార్పలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల

అనంతపురం ఎడ్యుకేషన్‌: కూటమి ప్రభుత్వంలో సర్కారు విద్య అటకెక్కుతోంది. స్కూళ్లు పునః ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా... నేటికీ ఏ ఒక్క స్కూల్‌కూ స్టూడెంట్‌ కిట్లు పూర్తిస్థాయిలో అందలేదంటే పేద పిల్లల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. ప్రతి స్కూలుకూ అరకొరగానే స్టూడెంట్‌ కిట్లు అందాయి. యూనిఫాం ఒక్క స్కూల్‌కూ ఇవ్వలేదు. గతంలో ఒక్కో విద్యార్థికి మూడు జతల సరిపడా క్లాత్‌ ఇచ్చి కుట్టుకూలి డబ్బులు తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. ఈ సారి కుట్టుకూలిపై సమగ్ర శిక్ష అధికారులకే స్పష్టత లేదు. ఇస్తారో లేదో కూడా అర్థం కాని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 1–10వ తరగతి విద్యార్థులు 2,17,170 మంది చదువుతున్నారు.

వేధిస్తున్న టీచర్ల కొరత..
గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నోటిఫికేషన్‌ విడుదల చేస్తే.. ఆ ప్రక్రియ ముందుకు సాగకుండా కూటమి నాయకులు అడ్డుపడ్డారు. అత్యవసరం కింద సర్దుబాటు ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులను బదిలీ చేసినా... వారు ఆ స్థానాలకు వెళ్లకుండా అడ్డంకులు సృష్టించారు. ఫలితంగా టీచర్ల కొరత ఏర్పడి బోధనకు ఆటంకంగా మారింది. చాలా స్కూళ్లలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు లేరు. కొన్నిచోట్ల విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండి టీచర్లు తక్కువ ఉన్నారు. మరికొన్ని చోట్ల విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండి టీచర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ క్రమంలో టీచర్ల సర్దుబాటు చేసే ఆలోచన కూడా ఇప్పటిదాకా చేయలేదు. గత ప్రభుత్వం జిల్లాలో 30 మంది దాకా టీచర్లను అత్యవసరం కింద బదిలీ చేసినా అమలు చేయకుండా అడ్డుకుంటున్నారు. 2019 ఎన్నికల ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 571 మంది టీచర్లను బదిలీలు చేయగా, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారందరూ బదిలీ స్థానాల్లో చేరారు. ఏ ఒక్కరినీ అప్పటి ప్రభుత్వం అడ్డుకోలేదు.

భోజనం.. అధ్వానం..
స్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై కాకుండా ఏజెన్సీలు, కార్మికుల తొలగింపుపై నేతలు, అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే సగానికి పైగా స్కూళ్లలో ఏజెన్సీల నిర్వాహకులను తప్పించారు. కొత్తగా ఏజెన్సీలు తీసుకున్న వారు నాణ్యతపై దృష్టి పెట్టకపోవడంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం కరువవుతోంది.

గతంలో పునఃప్రారంభం రోజే 'కిట్లు'
విద్యార్థుల తల్లిదండ్రులపై భారం పడకుండా గత ప్రభుత్వంలో 9 రకాల వస్తువులతో కూడిన 'జగనన్న విద్యా కానుక' కిట్లను 1–10 తరగతుల విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. పేద పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడలేదు. పాఠ్యపుస్తకాలు, నోట్‌ పుస్తకాలు, వర్క్‌బుక్స్‌, ఆక్స్‌ఫర్డ్‌, పిక్టోరియల్‌ డిక్షనరీలు, బ్యాగు, మూడు జతల యూనిఫాం, షూ, బెల్ట్‌ కలిపి ఒక్కో కిట్‌కు రూ.1,650 ఖర్చు చేసింది. 2020–21 మొదలుకుని 2023–24 వరకూ వరుసగా నాలుగేళ్లూ స్కూళ్లు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యా కానుక కిట్లు విద్యార్థులకు పంపిణీ చేసింది. నాలుగేళ్లలో కిట్ల కోసం రూ.138.70 కోట్లు ఖర్చు చేసింది. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో కిట్ల పంపిణీలో జాప్యం జరుగుతోంది.


యూనిఫాం ఇవ్వకపోవడంతో రంగు దుస్తుల్లో పాఠశాలకు వచ్చిన గుంతకల్లు పొట్టి శ్రీరాములు మునిసిపల్‌ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు


ఉరవకొండ పడమర ప్రాథమిక పాఠశాలకు హాజరైన ఐదుగురు విద్యార్థులు

యూనిఫాం ఇవ్వలేదు



స్కూలు తెరిచి ఇన్ని రోజులు గడిచినా ఇప్పటిదాకా యూనిఫాం ఇవ్వలేదు. పాత చినిగిపోయిన యూనిఫాం, రంగుల దుస్తులు వేసుకుని స్కూల్‌కు వస్తున్నాం. గత ఏడాది ఈ సమయానికి యూనిఫాంతో పాటు అన్ని రకాల పుస్తకాలు, బూట్లు ఇచ్చారు.
– వై.ధర్మతేజ, 9వ తరగతి, రాజేంద్రప్రసాద్‌ మునిసిపల్‌ హైస్కూల్‌, గుంతకల్లు

ఇంగ్లిష్‌ టీచరును నియమించాలి



మా స్కూల్‌కు చాలా సంవత్సరాలుగా ఇంగ్లిష్‌ టీచరు లేకపోవడంతో బోధనకు బాగా ఇబ్బందిగా ఉంది. ఎన్నోమార్లు హెచ్‌ఎంకు విన్నవించాం. ఇంగ్లిష్‌ సబ్జెక్టు లేక చదువుకోవడానికి చాలా కష్టంగా ఉంది. ప్రభుత్వం చొరవ తీసుకుని మా స్కూల్‌కు ఇంగ్లిష్‌ టీచరును వెంటనే నియమించాలి.
– గౌతమ్‌, 10వ తరగతి విద్యార్థి, బచ్చేహళ్లి, శెట్టూరు మండలం

షూ ఎప్పుడిస్తారో తెలీదు



మాకు విద్యా కానుక కిట్లు ఇచ్చారు. అందులో యూనిఫాం ఇవ్వలేదు. షూ కూడా లేదు. పాత యూనిఫాం వేసుకునే స్కూల్‌కు వస్తున్నాం. పోయినసారి స్కూల్‌ ప్రారంభం రోజే కిట్లు ఇచ్చారు. ఈ సారి యూనిఫాం, షూ ఎప్పుడిస్తారో తెలీదు. ఆయా వస్తువులను కూడా త్వరగా అందజేయాలి.
– కేశవర్ధన్‌, 9వ తరగతి, కళ్యాణదుర్గం

పేద పిల్లల్ని పట్టించుకోకుంటే ఉద్యమాలే



పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం తగదు. విద్యార్థులు ఎక్కువగా ఉండి టీచర్లు తక్కువగా ఉన్న స్కూళ్లపై అధికారులు దృష్టి సారించాలి. విద్యార్థులు నష్టపోకుండా చూడాలి. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను తప్పించడంలో చూపిస్తున్న శ్రద్ధ పిల్లలకు పౌష్టికాహారం అందించే అంశంలో చూపించాలి. లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చుడతాం.
– జి.వీరేంద్రప్రసాద్‌, పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి

తప్పకుంటారా.. తప్పిస్తారా?



- ఎస్కేయూ రెక్టార్‌, రిజిస్ట్రార్‌లలో ఒకరికి పదవీ గండం
- నియామకాల్లో నిబంధనలు పాటించకపోవడమే కారణం
- ఇద్దరిలో ఎవరు రాజీనామా చేస్తారనే దానిపై ఉత్కంఠ

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెక్టార్‌, రిజిస్ట్రార్లలో ఎవరో ఒకరికి పదవీ గండం తప్పని పరిస్థితి నెలకొంది. ఇద్దరిలో ఎవరిని తప్పించాలనే అంశంపై వర్సిటీ యాజమాన్యం ఉక్కిరిబిక్కిరవుతోంది. మరోవైపు పదవిని వీడేది లేదంటూ రెక్టార్‌, రిజిస్ట్రార్‌ బాహాటంగా పేర్కొంటున్నారు. ఎలాగైనా ప్రజాప్రతినిధుల ఆశీస్సులు పొంది పోస్టులు నిలుపుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

నియామకాలే వివాదాస్పదం..
రిజిస్ట్రార్‌, రెక్టార్‌ నియామకాలపై మొదటి నుంచి వివాదం నెలకొంది. రిజిస్ట్రార్‌ నియామకంలో తొలి ప్రాధాన్యత ప్రొఫెసర్లకు ఇవ్వాలి. వారిలో నిష్ణాతులు లేకపోతే డిప్యూటీ రిజిస్ట్రార్‌ స్థాయి వారికి కేటాయించాలి. అయితే, ఆయా వర్గాలకు కాకుండా ఏకంగా రీసెర్చ్‌ కమ్‌ స్టాటిస్టికల్‌ ఆఫీసర్‌ అయిన డాక్టర్‌ రమేష్‌ బాబుకు రిజిస్ట్రార్‌ పదవిని కట్టబెట్టారు. మరో వైపు కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు వారాల్లోనే రెక్టార్‌గా ప్రొఫెసర్‌ వెంకటనాయుడును నియమించారు. వాస్తవానికి సీనియార్టీలో టాప్‌–3లో ఉన్న వారికి రెక్టార్‌ పదవి అప్పగిస్తారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌ వీసీ నియామకంలోనూ రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరించింది. కానీ, సీనియార్టీ లిస్టులో 16వ స్థానంలో ఉన్న వెంకటనాయుడును రెక్టార్‌గా నియమించడం చర్చనీయాంశమైంది. దీనికితోడు రిజిస్ట్రార్‌, రెక్టార్‌లు ఇద్దరూ ఒకే సామాజికవర్గానికి చెందిన వారు కావడం మరింత వివాదాస్పదమైంది. ఉన్నత పదవుల్లో సామాజిక న్యాయం పాటించాలని, పక్షపాతం చూపరాదని ఉన్నత విద్యాశాఖ నిర్దేశించినా, ఉల్లంఘిస్తూ నిర్ణయాలు తీసుకోవడం విమర్శలకు తావిచ్చింది. దీంతో మనస్తాపం చెందిన కొందరు సీనియర్‌ ప్రొఫెసర్లు విషయాన్ని మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌, ఉన్నత విద్య ప్రిన్సిపల్‌ సెక్రటరీ సౌరభ్‌ గౌర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఉన్నత విద్య ప్రిన్సిపల్‌ సెక్రటరీ... వివరణ ఇవ్వాలంటూ వర్సిటీ యాజమాన్యాన్ని ఆదేశించారు. నియామకాల్లో సామాజిక న్యాయం పాటించాలని చెప్పినా ఏకపక్షంగా ఎలా నిర్ణయాలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించడం సంచలనంగా మారింది. ఇద్దరిలో ఎవరో ఒకరిని తప్పించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో వచ్చే పాలకమండలి సమావేశంలోపే వర్సిటీ యాజమాన్యం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పదవీ గండం తప్పదనే సంకేతాలు వెలువడడంతో రెక్టార్‌, రిజిస్ట్రార్‌లు అప్రమత్తమయ్యారు. గ్రూపు రాజకీయాలకు తెరలేపారు. పదవిని కాపాడుకునేందుకు ఎవరికి వారుగా తమ సామాజికవర్గానికి చెందిన వారిని వెంటబెట్టుకుని ప్రజాప్రతినిధుల ఇళ్లకు క్యూకడుతున్నట్లు తెలిసింది.

శ్రావణం.. నెట్టికంటుడి వైభవం

- కసాపురంలో నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


నెట్టికంటి ఆంజనేయస్వామి


కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం

గుంతకల్లు రూరల్‌: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శ్రావణ మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నెల రోజుల పాటు ఘనంగా సాగనున్నాయి. అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలకు భక్తులు భారీగా హాజరుకానున్న నేపథ్యంలో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆలయ అధికారులు చేపట్టారు.

విశేషాలంకరణలో భక్తులకు కటాక్షం..
ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న మొదటి శనివారం స్వామివారికి వజ్రకవచాలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు. సాయంత్రం సీతారామచంద్ర లక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను శేషవాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఈనెల 17న రెండో శనివారం ఉత్సవమూర్తులను హనుమంతవాహనంపై, 24వ తేదీ మూడవ శనివారం గజ వాహనంపై, 31వ తేదీ నాల్గో శనివారం గరుడ వాహనంపై కొలువుదీర్చి ఆలయ పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఐదు మంగళవారాల్లోనూ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్లను వెండిరథంలో కొలువుదీర్చి ప్రాకారోత్సవం చేపడతారు.

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు..
భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఉచిత దర్శనం, ముఖమండప దర్శనం, శీఘ్ర దర్శనం, అతిశీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు. కల్యాణ మండపాలతోపాటు అన్నదాన కేంద్రం పక్కనున్న రేకుల షెడ్డు, గంగా నిలయం, పీఏసీలో ఉన్న డార్మెటరీ హాళ్లలో ఉచిత వసతి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నీటి కొళాయిలు, స్వామి దర్శనానంతరం ఉచిత ప్రసాద వితరణ కేంద్రం ఏర్పాటు చేశారు. తూర్పు రాజ గోపురం ముందు భాగంలో ఉన్న బెల్దోణ సత్రంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అన్నదానం చేయనున్నారు. భక్తుల కాలక్షేపం కోసం హరికథలతోపాటు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. రామదూత నిలయం ముందు భాగాన్ని వాహనాల పార్కింగ్‌కు కేటాయించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు, ఎస్‌ఎస్‌ఎస్‌, స్కాట్‌ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. ఆలయ ముందుభాగంలో మెడికల్‌ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సులువుగా ఆలయం చేరుకునేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపనున్నారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌ నుంచి బస్సులు నడవనున్నాయి.

ఏర్పాట్లు పూర్తి..



ఆలయంలో నెల రోజుల పాటు వైభవంగా జరిగే శ్రావణమాస ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశాం. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించాం. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం గుంతకల్లు రైల్వే స్టేషన్‌, బస్టాండ్‌ నుంచి ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అత్యంత శుభప్రదమైన ఈ శ్రావణమాసంలో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరుతున్నా.
– భద్రాజీ, ఆలయ ఈఓ

క్లుప్తంగా

ఐఎస్ఓ బృందం పరిశీలన



ఐసీడీఎస్ పీడీ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న ఐఎస్ఓ బృందం సభ్యుడు

అనంతపురం సెంట్రల్: మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ఆదివారం హైదరాబాద్ నుంచి వచ్చిన గ్లోబల్ మేనేజ్‌మెంట్ సర్టిఫికేషన్ సర్వీసెస్ సంస్థ సభ్యులు తనిఖీ చేశారు. ఐఎస్ఓ ప్రమాణాలకు అనుగుణంగా కార్యాలయం ఉందా అనే అంశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయంలో చేపట్టాల్సిన పలు మార్పులు, చేర్పులపై ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవికి సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన లీడ్ ఆడిటర్ కేఎస్ఎన్ ప్రసాద్, కో ఆడిటర్ సింగయ్య, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో ఓవరాల్ చాంపియన్ 'విజయనగరం'



చాంపియన్ ట్రోఫీతో విజయనగరం క్రీడాకారులు

తాడిపత్రి అర్బన్: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా తాడిపత్రిలో సాగుతున్న రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారు. పోటీల్లో 13 జిల్లాలకు చెందిన సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం జరిగిన పోటీల్లో విజయనగరం జిల్లా చాంపియన్ షిప్‌ను దక్కించుకోగా, రెండో స్థానంలో అనంతపురం జిల్లా, మూడో స్థానంలో తూర్పు గోదావరి జిల్లా క్రీడాకారులు నిలిచారు. ఈ పోటీల్లో బంగారు పతకాలను సాధించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు సాయి తెలిపారు.

అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 జిల్లా క్రికెట్ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. ఆర్డీటీ క్రీడా గ్రామంలో నిర్వహించిన ఈ ప్రక్రియకు మొత్తం 229 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా టీవీ చంద్ర మోహన్‌రెడ్డి, సభ్యులుగా ఎస్.నజీర్‌అహమ్మద్, రాఘవేంద్ర వ్యవహరించారు.

తమిళనాడు, కేరళ జట్ల విజయం



హోరాహోరీగా తలపడుతున్న అరుణాచల ప్రదేశ్, కేరళ జట్ల క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ క్రీడాగ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు రెండో రోజు ఆదివారం హోరాహోరీగా సాగాయి. ముఖ్య అతిథిగా సీఐ విశ్వనాథచౌదరి, ఫుట్‌బాల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నాగరాజు, సంయుక్త కార్యదర్శి ఈరన్న గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఉదయం జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు, గుజరాత్ జట్లు తలపడ్డాయి. 4-0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టు విజయం సాధించింది. అలాగే మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో 3-0 గోల్స్ తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌పై కేరళ జట్టు విజయం సాధించింది.

'తుంగభద్ర' పలకరింపు.. జనం పులకింత

తుంగభద్ర జలాల సవ్వడితో పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) పరిసరాలు ఆకట్టుకుంటున్నాయి. పెన్నహోబిలం ఆలయ సమీపంలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. పరవళ్లు తొక్కుతున్న జలాలను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంటోంది. - సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం/ఉరవకొండ:



పీఏబీఆర్‌లోకి చేరుకుంటున్న నీరు



పీఏబీఆర్‌లో చేపలు పట్టేందుకు వల వేస్తున్న దృశ్యం



పెన్నహోబిలం ఆలయం వద్ద కనువిందు చేస్తున్న తుంగభద్ర జలాలు



వలలో పడిన చేపలను ఒడ్డుకు చేరుస్తున్న జాలరి

హామీల అమలులో కూటమి వైఫల్యం

- తీవ్ర వర్షాభావంతో ముందుకు సాగని ఖరీఫ్
- ముందస్తు కరువు ప్రణాళిక సిద్ధం చేయకపోవడం దురదృష్టకరం
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. హామీలు అమలు చేయడం చేత కాక అర్థం చేసుకోవాలంటూ సీఎం చంద్రబాబు దొంగ నాటకాలకు తెరలేపారని మండిపడ్డారు. ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో తక్షణమే రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు అందించాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో పెట్టుబడి సాయం కింద రూ.35 వేల కోట్లను రైతుల ఖాతాల్లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారని గుర్తు చేశారు. అలాగే ఏటా ఉచిత పంటల బీమా, సున్నావడ్డీ పథకాలను కూడా రాజకీయాలకు అతీతంగా అత్యంత పారదర్శకంగా అమలు చేశామన్నారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇప్పటి వరకూ అమలు చేయలేదన్నారు. దీంతో పాటు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రస్తావన ఊసే లేకుండా పోయిందన్నారు. పంటల బీమా పరిహారం చెల్లింపుపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఇప్పటి వరకూ ఈ-క్రాప్ నమోదు కూడా సక్రమంగా చేపట్టలేదన్నారు. హామీలను అమలు చేయకపోగా... పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా ఓటాన్ అకౌంట్‌కు వెళ్లడం చూస్తుంటే ప్రజలను మోసం చేసేందుకేనని స్పష్టమవుతోందన్నారు. తన మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఎప్పుడు అమలు చేస్తారో కూడా సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పలేకపోతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడంతో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి..

ఉరవకొండలో వైఎస్సార్‌సీపీ హయాంలో తాగునీటి సమస్య పరిష్కారానికి సిస్టన్ ట్యాంకులు పెద్ద ఎత్తున ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకూ రూ.30 కోట్ల వ్యయంతో పైప్‌లైన్ నిర్మాణం చేపట్టేలా టెండర్లకు అప్పటి జగన్ ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.అలాగే జేజేఎం ద్వారా ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేసే పనులు చేపడితే కొందరు దురుద్దేశంగా అడ్డుకున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా రూ.17 కోట్ల పనులకు శ్రీకారం చేపట్టామని, కొనకొండ్లలో తాగునీటి పథకం కోసం రూ.40లక్షలు మంజూరు చేయించామని గుర్తు చేశారు. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఆయా పనులు చేపట్టలేకపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులు పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని కూటమి నేతలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు సీపీ వీరన్న, ఏసీ ఎర్రిస్వామి, సింగాడి తిప్పయ్య, బసవరాజు, ఓబన్న, లత్తవరం గోవిందు, ఆసిఫ్, జీఎంఎస్ మీరం బాషా, శేఖర్, హనుమంతు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీగా జోసెఫ్



సమావేశానికి హాజరైన వివిధ జిల్లాలకు చెందిన ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ కార్యదర్శులు

పుట్టపర్తి: ఏపీ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీగా జిల్లాకు చెందిన కేజే జోసెఫ్‌కు చోటు దక్కింది. ఆదివారం పుట్టపర్తిలోని సాయిమా కన్వెన్షన్ హాల్‌లో ఇండియన్ ఫ్లోర్ బాల్ ఫెడరేషన్ సెక్రటరీ రవీంద్ర చౌథ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో రాష్ట్ర సెక్రటరీగా జోసెఫ్‌ను 26 జిల్లాలకు చెందిన సెక్రటరీలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా జోసెఫ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఫ్లోర్ బాల్ క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఉభయ జిల్లాల ఎస్జీఎఫ్ సెక్రటరీలు సుగుణమ్మ, పూల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదు: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం: తన పేరు చెప్పి ఎవరైనా బెదిరింపులు, దందాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హెచ్చరించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి పేరు చెప్పి దందాలు సాగిస్తున్న వైనంపై 'భలే మంచి చౌక బేరం' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే... ఓ ప్రకటన విడుదల చేశారు. తన పేరు చెప్పి బెదిరింపులకు పాల్పడే వారి సమాచారాన్ని నేరుగా తనకు అందజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని అన్నారు.

రైతులపై టీడీపీ నేత దాష్టీకం

- తరాలుగా వాడుకలో ఉన్న రహదారి మూసివేత
- రైతులు వేడుకున్నా కనికరించని టీడీపీ నేత అనుచరులు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు



పొలంలోకి వెళ్లే దారిని తవ్వి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ధర్మవరం: రైతులు పొలాలకు వెళ్లే రహదారిని తన అనుచరులతో మూత వేయించి టీడీపీ నేత సందా రాఘవ దౌర్జన్యానికి తెగబడ్డారు. వివరాలు... ధర్మవరం మండలం గొల్లపల్లి గ్రామంలో సర్వే నంబర్ 296-2లో లింగమయ్య, నాగభూషణ, ఆదినారాయణకు 3.98 ఎకరాల పొలం ఉంది. వీరికి ముందు భాగాన టీడీపీ నేత సందా రాఘవ అనుచరుడు పడమల శేషయ్యకు 2 ఎకరాల పొలం ఉంది. అయితే తాతల కాలం నుంచి వీరి పొలాలకు మధ్యన రహదారి ఉంది. ఈ రహదారి గుండానే రైతులు రాకపోకలు సాగించేవారు. అయితే 2022లోనే రహదారిని మూసివేసేందుకు పడమల శేషయ్య యత్నించాడు. అప్పుడు బాధిత రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో మండల సర్వేయర్‌తో సర్వే చేయించి రికార్డుల్లో రహదారిగా నమోదై ఉండడంతో వెంటనే పునరుద్ధరించి శేషయ్య ఆలోచనకు అడ్డుకట్ట వేశారు. దీనిపై శేషయ్య కోర్టును ఆశ్రయించాడు.

ప్రభుత్వం మాది అంటూ...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి మూసివేసేందుకు టీడీపీ నాయకులు ప్లాన్ వేశారు. అనుకున్నదే తడవుగా శనివారం సాయంత్రం సందా రాఘవ అనుచరులు పొలం వద్దకు జేసీబీలతో చేరుకుని రహదారిని ఛిద్రం చేశారు. రహదారి మధ్యలో గుంతలు తవ్వి అడ్డుగా మట్టి వేశారు. ఈ స్థలం కోర్టు పరిధిలో ఉందంటూ హెచ్చరిక బోర్డునూ ఏర్పాటు చేశారు. రోడ్డును ధ్వంసం చేయరాదంటూ బాధిత రైతులు ప్రాధేయపడినా వినలేదు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం రాజ్యమేలుతోందని, తమను అడ్డుకునే వారు ఎవరూ లేరంటూ దౌర్జన్యం చేశారు. ఎవరైనా ఎదురు తిరిగితే ఎంతకైనా తెగిస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఘటనపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఈ సందర్భంగా బాధిత రైతులు వాపోయారు. అంతేకాక రీసర్వే చేయించుకోవాలంటూ ఉచిత సలహా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని తమ పంట పొలాలకు దారి ఇచ్చేలా చొరవ తీసుకోవాలని కోరారు.

యాపిల్ ఫ్యాక్టరీ మేనేజర్‌పై హత్యాయత్నం

- తారస్థాయికి చేరుకున్న వర్కర్ల మధ్య విభేదాలు
- పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో ఆలస్యంగా వెలుగులోకి

రాయదుర్గం (డి.హీరేహాళ్): డి.హీరేహాళ్ మండలంలోని యాపిల్ ఐరన్‌ఓర్ ఫ్యాక్టరీలో వర్కర్ల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పని విషయంలో తలెత్తిన గొడవ చివరకు ఆ ఫ్యాక్టరీ ప్రాసెస్ మేనేజర్‌పై హత్యాయత్నానికి దారి తీసింది. పోలీసులు తెలిపిన మేరకు... యాపిల్ ఫ్యాక్టరీలో ల్యాబ్ ఇన్‌చార్జ్‌గా గొడిశెలపల్లి నివాసి మంగలి హనుమంతరెడ్డి, ప్రాసెస్ మేనేజర్‌గా బళ్లారికి చెందిన సతీష్ విధులు నిర్వర్తిస్తున్నారు. కొంత కాలంగా పని విషయంలో ఇద్దరి మధ్య వివాదం చెలరేగుతోంది. దీంతో సతీష్‌ను ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని హనుమంతరెడ్డి పథకం వేశాడు. ఈ క్రమంలోనే శనివారం విధులు ముగించుకుని సాయంత్రం బళ్లారికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న సతీష్‌ను ఓబుళాపురం ఫ్లైఓవర్ వద్ద హనుమంతరెడ్డి అడ్డుకున్నాడు. తనకే అడ్డు చెబుతావా? అంటూ సహోద్యోగులైన జేసీబీ ఆపరేటర్ సోములాపురం గ్రామానికి చెందిన గిరీష్, డి.హీరేహాళ్ గంగిరెడ్డి, బళ్లారికి చెందిన రషీద్, మరో నలుగురితో కలసి కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న సతీష్‌ను చూసి మృతి చెందాడని అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అటుగా వెళుతున్న వారు గమనించి సతీష్‌ను బళ్లారిలోని ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై ఆదివారం ఉదయం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. కాగా, మంగలి హనుమంతరెడ్డి టీడీపీ సానుభూతిపరుడు కావడంతో ఆ పార్టీ నేత చూసుకుని చెలరేగిపోతున్నాడని పలువురు ఆరోపించారు.

ఖరీఫ్ పంటల్లో సస్యరక్షణ అవసరం



వేరుశనగ పంట

అనంతపురం అగ్రికల్చర్: ఓ వైపు వర్షాభావం, మరో వైపు భిన్నమైన వాతావరణ పరిస్థితుల మధ్య ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. గత 25 రోజులుగా వర్షాలు లేనందున సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పత్తి తదితర పంటలు బెట్టకు గురైనట్లు తెలిపారు. బెట్టను అధిగమించేందుకు వేరుశనగ, కంది, ఆముదం పంటల్లో ప్రస్తుతం లీటర్ నీటికి 10 గ్రాముల 19-19-19 కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. నీటివసతి ఉన్న ప్రాంతాల్లో పూత దశకు చేరుకున్న వేరుశనగకు ఒక రక్షకతడి ఇస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. వర్షం వస్తే తేమశాతం, నీటి సంరక్షణను బాగా పెంచుకునేందుకు వీలుగా వేరుశనగ పంటలో ప్రతి 3.6 మీటర్లకు ఒక తల్లిచాలు (గొడ్డుచాలు) ఏర్పాటు చేయాలన్నారు. విత్తే సమయంలో లేదా విత్తిన నెల రోజుల్లోపు గొడ్డుచాలు కోసం దున్నినా ఇబ్బంది ఉండదన్నారు. కందిలో మొక్కల మధ్య 20 సెంటీమీటర్లు, ఆముదంలో మొక్కల మధ్య 60 సెంటీమీటర్ల దూరం ఉండేలా చేస్తే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. అలాగే అంతర సేద్యం ద్వారా కలుపు లేకుండా చూసుకోవాలన్నారు.

ఇక ప్రధాన పంటల సాగుకు అదను ముగిసినందున ఈ నెలలో వర్షాలు కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ఎర్ర నేలల్లో స్వల్పకాలిక రకమైన కంది, జొన్న, కొర్ర (సూర్య, మహానంది రకం), సజ్జ, అలసంద, పెసర (ఐపీఎం-2-14, డబ్ల్యూజీజీ-42 రకం), ఉలవ, ఆముదం, పెసర, అనుము పంటలు వేసుకోవాలన్నారు. నల్లనేలల్లో కంది, ఆముదం, పత్తి వేసుకోవచ్చని తెలిపారు.

ఆకట్టుకున్న 'ప్రేమ బాటలో మణి దీపాలు'



సత్యసాయి పల్లకీ ఉత్సవాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి చేరుకున్న తూర్పుగోదావరి జిల్లా భక్తులు ఆదివారం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. సత్యసాయి స్ఫూర్తిని, సత్యసాయి బాలవికాస్ విశిష్టతను కీర్తిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. ఉదయం సాయికుల్వంత్ సభామందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి సహస్ర నామార్చన నిర్వహించారు. సుమారు రెండు వేల మంది ఏక కాలంలో సహస్ర నామాలను పఠించారు. సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన 'ప్రేమ బాటలో మణి దీపాలు' నృత్యరూపకం ఆద్యంతం ఆలోచనాత్మకంగా సాగింది.



శాస్త్రీయ నృత్యంతో ఆకట్టుకుంటున్న బాలికలు



నాటికలోని ఓ సన్నివేశం

రూ.వెయ్యి కోట్ల బీమా విడుదల చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్



సమావేశంలో మాట్లాడుతున్న వి.రాంభూపాల్

అనంతపురం అర్బన్: 'గత ఏడాది నుంచి వర్షాభావం వెంటాడడంతో జిల్లా అంతటా కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రకటించిన రూ.వెయ్యి కోట్ల బీమా పరిహారాన్ని తక్షణం విడుదల చేసి, జిల్లా రైతులను ఆదుకోవాలి' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఓ.నల్లప్ప అధ్యక్షతన జరిగిన ఆ పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. రాంభూపాల్ మాట్లాడుతూ.. గత ఏడాది ఖరీఫ్‌లో 28 మండలాలు, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా జిల్లా మొత్తం కరువు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు అదనపు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు విడుదల చేసి కూలీలను ఆదుకోవాలన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసే యోచనలో కూటమి ప్రభుత్వం ఉండడంతో తక్షణమే ప్రభుత్వ డెయిరీని పునరుద్ధరించి పాల కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కేరళ బాధితులను ఆదుకుందాం..

కేరళలోని వాయినాడు బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛందంగా విరాళాలు అందజేయాలని జిల్లా ప్రజలకు రాంభూపాల్ పిలుపునిచ్చారు. ఈ నెల 5, 6 తేదీల్లో విరాళాలు సేకరించేలా కార్యాచరణను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్రి, నాగేంద్రకుమార్, శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు రామిరెడ్డి, ఆర్వీనాయుడు, రామాంజినేయులు, కృష్ణమూర్తి, వెంకటనారాయణ, నిర్మల, నాగమణి, భాస్కర్, రంగారెడ్డి, జగన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్య చౌడేశ్వరికి పూజలు


అలంకరణలో సత్య చౌడేశ్వరీ దేవి

రాప్తాడు: అనంతపురం రూరల్ మండలంలోని నరసనాయన కుంట గ్రామంలో వెలసిన సత్య చౌడేశ్వరి అమ్మవారికి ఆదివారం ఆలయ పూజారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం అమావాస్య కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం దగ్గర భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రపంచ స్థాయి కథల పోటీలకు 'నాన్న సంతకం'

అనంతపురం కల్చరల్: నగరానికి చెందిన రచయిత చంద్రమౌళి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. తెలుగు సాహిత్యానికి పెద్ద పీట వేస్తూ నిర్వహించబడిన ప్రతిష్టాత్మక తటవర్తి భారతి స్మారక ప్రపంచ స్థాయి కథల పోటీలకు చంద్రమౌళి రాసిన 'నాన్న సంతకం' కథను ఎంపిక చేశారు. కామిశెట్టి చంద్రమౌళి పెద్దవడుగూరు మండలం లక్ష్ముంపల్లి గ్రామంలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తూనే ప్రవృత్తి రీత్యా కవిగా, రచయితగా ఎన్నో ఆలోచనాత్మక కథలు, కవితలు రాశారు.

టీచర్లను సర్దుబాటు చేయాలి


మాట్లాడుతున్న ఫణిభూషణ్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆగస్టు నెల ప్రారంభమైనప్పటికీ అవసరమైన స్కూళ్లకు టీచర్లను సర్దుబాటు చేయకపోవడం బాధాకరం. వెంటనే ఈ ప్రక్రియను చేపట్టాలని ఎస్టీయూ మునిసిపల్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఫణిభూషణ్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో చాలా కాలమైనా ప్రమోషన్లు, బదిలీలు చేపట్టక పోవడంతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. పాఠశాలల్లో రేషనలైజేషన్ జరిపి విద్యార్థులు ఎక్కువగా ఉన్న పాఠశాలలకు శాశ్వతంగా పోస్టులను సర్దుబాటు చేయాలన్నారు. ఎల్‌ఎఫ్ ఎల్ హెచ్‌ఎం పోస్టులో ఉన్న వారికి, వారి విల్లింగ్ మేరకు స్కూల్ అసిస్టెంట్‌గా కన్వర్షన్ చేయాలన్నారు. తెలుగు, హిందీ సబ్జెక్టుల ప్రమోషన్లను వెంటనే కల్పించాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, నాయకులు మురళీకృష్ణ, విరూపాక్షగౌడ్, వేణుగోపాల్, కృష్ణమూర్తి నాయుడు, నగర నాయకులు సురేష్ కుమార్, ప్రభాకర్, గంగాధర్ పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాం తాగునీరు పంప్ చేసే మోటర్ల మరమ్మతుల కారణంగా సోమవారం నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ రామమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

అనంత రైతులను ఆదుకోండి


మాట్లాడుతున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్

అనంతపురం టవర్‌క్లాక్: దేశ వ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన అనంత రైతులు నేడు దయనీయ పరిస్థితిలో ఉన్నారు. తక్షణమే అనంత రైతులను ఆదుకోవాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ అన్నారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటి వరకూ వేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. జిల్లా ప్రధాన పంట వేరుశనగ కేవలం 10 వేల ఎకరాల్లో మాత్రమే సాగైనట్లు వెల్లడించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిశాయన్నారు. ఇప్పటికైనా జిల్లాలో అన్ని చెరువులు నీరు నింపి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులకు పంట నష్ట పరిహారం, సబ్సిడీ పరికరాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు డ్రిప్ పరికరాలు పూర్తిగా ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో గాజుల వాసు, రామ్ చరణ్ యాదవ్, శర్మాస్ వలి, ఇంద్రావతి, మురళి, కవిత పాల్గొన్నారు.

పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయొద్దు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని డివైడర్లు, పబ్లిక్ స్థలాలు, గోడల మీద ఎటువంటి అనధికారికంగా పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్స్ ఏర్పాటు చేయొద్దని నగరపాలక సంస్థ ఏసీపీ మారుతీహరి ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పోస్టర్లు, బ్యానర్లు, తదితర వాటిని ఏర్పాటు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇట్లయితే.. చదువులెలా?



సరస్వతీ నిలయాల్లో సమస్యల తిష్ట

655 మందికి ఆరుగురే ఉపాధ్యాయులు

అనంతపురం నగరంలోని రహమత్ నగరపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులు ఉన్నారు. ఐదుగురు టీచర్లు పని చేస్తున్నారు. మరో ఆరు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎస్కేడీ నగరపాలక ఉన్నత పాఠశాలలో 655 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం 22 మంది టీచర్లు అవసరం కాగా ప్రస్తుతం కేవలం ఆరుగురు మాత్రమే విధులు నిర్వరిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అయితే టీడీపీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి పోస్టులు భర్తీ కాకుండా అడ్డుకుంది. పలు పాఠశాలల్లో తాత్కాలికంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు ప్రయత్నించింది. అయితే ఉపాధ్యాయులు విధుల్లోకి చేరకుండా టీడీపీ అడ్డుకోవడంతో ఇబ్బందులు తలెత్తాయి.

తెలుగు పండిట్ పోస్టు ఖాళీ..

కనగానపల్లి మండలం మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండిట్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నాగేంద్ర రెడ్డి రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. తర్వాతా ఉపాధ్యాయులు బదిలీలు కూడా జరగకపోవడంతో అక్కడ తెలుగు పండిట్ పోస్టు ఖాళీగా ఉంది. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతుల విద్యార్థులు తెలుగు పండిట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- యూనిఫాం లేక రంగుల దుస్తుల్లో వెళ్తున్న విద్యార్థులు
- పలు స్కూళ్లల్లో టీచర్ల కొరత
- నేటికీ స్కూళ్లకు సరఫరా కాని డిక్షనరీలు
- స్కూళ్లు ప్రారంభమై రెండు నెలలవుతున్నా పూర్తిగా అందని స్టూడెంట్ కిట్లు


ఆత్మకూరు మండలం వడ్డిపల్లిలో మూడు తరగతుల విద్యార్థులకు ఒకేచోట పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

మూడు తరగతులకు ఒకే టీచర్

ఆత్మకూరు మండలం వడ్డిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడు తరగతులకు (1, 2, 3 తరగతులు) కలిపి ఒకే ఉపాధ్యాయురాలు విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలో మొత్తం ఐదు తరగతులు ఉండగా .. ప్రధ్యానోపాధ్యాయుడు 4, 5 తరగతుల విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠశాలలో మొత్తం 21 మంది పిల్లలు చదువుతున్నారు. ఏదైనా అత్యవసరం అయితే సెలవు పెట్టేందుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులు అంతంత మాత్రంగానే చదువుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. పాఠశాలలు పునఃప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు పూర్తిస్థాయిలో యూనిఫాం సరఫరా చేయలేదు. చాలా స్కూళ్లల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. విద్యా సంవత్సరంలో కీలకమైన రెండు నెలలు పూర్తవుతున్నా నేటికీ ఆయా స్కూళ్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. దీంతో విద్యార్థుల చదువులకు తీవ్ర ప్రతిబంధకంగా మారింది. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేశారు. పిల్లలకు మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకున్నారు. 9 రకాల వస్తువులతో విద్యాకానుక కిట్లు అందజేశారు. ఏటా స్కూళ్లు తెరిచిన తొలిరోజే ఈ కిట్లు విద్యార్థుల చేతుల్లో ఉండేవి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి సంవత్సరమే కిట్లు పంపిణీలో జాప్యం జరుగుతోంది. స్కూళ్లు తెరిచి రెన్నెళ్లవుతున్నా నేటికీ కిట్లలోని వస్తువులు అన్ని స్కూళ్లకు అందలేదు. అనంతపురం అర్బన్, రూరల్ మండలాల పరిధిలో మొత్తం 125 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. 19,875 మంది 1 నుంచి 10వ తరగతి విద్యార్థులు చదువుతున్నారు.

నాణ్యత లోపించిన భోజనం

గోరుముద్ద పథకం ద్వారా గత ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారం అందించింది. ఇందు కోసం ప్రత్యేకంగా మెనూ తయారు చేసి అమలు చేశారు. నేటికీ అదే మెనూ ఉన్నా.. మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీలను చాలాచోట్ల బలవంతంగా తొలిగించారు. అధికార పార్టీతో అంటకాగుతున్న వారికి కట్టబెట్టడంతో వారు తూతూ మంత్రంగా మెనూ అమలు చేస్తున్నారు. ఈ విషయం ప్రధానోపాధ్యాయులు, టీచర్లకు తెలిసినా నోరు మెదపడం లేదు. ఉన్నతాధికారులు ఈవైపు దృష్టి సారించడం లేదు.


కనగానపల్లిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

కనగానపల్లి/ఆత్మకూరు/చెన్నేకొత్తపల్లి/రామగిరి/రాప్తాడు: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశాలల్లో విద్యాబోధన అంతమాత్రంగానే సాగుతోంది. రాప్తాడు నియోజకవర్గంలో 258 దాకా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సుమారు 28 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ వీరికి సరిపడా ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యా బోధన కుంటుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలకు కూటమి ప్రభుత్వం వచ్చాక బ్రేక్ పడింది. దీంతో పలుచోట్ల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరు. రాప్తాడు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. నియోజకవర్గంలో ఆరు మండలాల్లోని 258 పాఠశాలల్లో 750 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. కాని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఎక్కువగా ఉంటే కొన్ని ఒక్కరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. ఇక ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయుల అవసరం ఉండగా.. కొన్నిచోట్ల తెలుగు, హిందీ, సైన్స్ సబ్జెక్టులకు ఉపాధ్యాయులు లేరు.

2 వేల మందికి అందని కిట్లు

ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు స్టూడెంట్ కిట్ల కొరత ఉందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాత విద్యార్థులకు సంబంధించిన కిట్లను గత ప్రభుత్వ హయాంలోనే సరఫరా చేయగా.. కొత్తగా పాఠశాలల్లోకి చేరే 1, 3, 6 తరగతుల విద్యార్థులకు పుస్తకాలతో పాటు బ్యాగులు, షూ అందించలేకపోతున్నారు. దీంతో నియోజక వర్గంలోని సుమారు 2 వేల మంది విద్యార్థులకు ఇంకా కిట్లు అందించాల్సి ఉంది.

యూనిఫాం చిరిగిపోయింది..



నేను పదో తరగతి చదువున్నా. మా స్కూల్‌లో ఇప్పటి దాకా 10వ తరగతి విద్యార్థులకు స్టూడెంట్ కిట్లలో బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మాత్రమే ఇచ్చారు. తక్కిన యూనిఫాం, షూ, బెల్ట్, టై, డిక్షనరీలు ఇవ్వలేదు. గతేడాది ఇచ్చిన ఇచ్చిన యూనిఫాం వేసుకుని పోతున్నాం. అవి చిరిగిపోయాయి. రంగుల దుస్తులు వేసుకుని పోతే టీచర్లు తిడుతున్నారు.

– రెహనా, 10వ తరగతి విద్యార్థిని, అనంతపురం

గతంలో తొలిరోజే కిట్లు అందాయి..



గతంలో స్కూళ్లు తెరిచిన రోజునే విద్యాకానుక కిట్లు ఇచ్చారు. ఈసారి స్కూళ్లు తెరిచిన తర్వాత ఇచ్చినా అందులో అన్ని వస్తువులూ లేవు. ఇప్పటిదాకా యూనిఫాం ఇవ్వలేదు. కొత్త యూనిఫాం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. షూ, బెల్ట్, టై, డిక్షనరీలు కూడా వెంటనే అందజేయాలి.

– ధరణీశ్వర్ 6వ తరగతి, అనంతపురం

ప్రభుత్వం తీరు మారాలి



పేద విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం తీరు మారాలి. విద్యార్థులకు సదుపాయాల కల్పనలో అలసత్వం ప్రదర్శించడం సరికాదు. రెండు నెలలు గడుస్తున్నా స్టూడెంట్ కిట్లు అందలేదు. చాలా స్కూళ్లల్లో టీచర్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి.

– ఎనుమల నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పేద విద్యార్థులపై నిర్లక్ష్యం



పేద విద్యార్థులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. స్కూళ్లు తెరిచి రెండు నెలలు గడుస్తున్నా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫాం ఇవ్వకపోవడం దుర్మార్గం. దీనిని చూస్తుంటే వారిపై ఉన్న చిత్తశుద్ధి అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇచ్చిన యూనిఫాం చినిగిపోయినా వాటితోనే పిల్లలు బడులకు వెళ్తున్నారు. చాలా స్కూళ్లల్లో టీచర్ల కొరత ఉన్నా కనీస చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏమైనా పర్వాలేదు అనే ధోరణితో ముందుకెళ్తున్నారు.

– ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కష్టపడి చదివితే ఉజ్వల భవిత


అభ్యర్థులకు డీఎస్సీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం సిటీ: కష్టపడి చదువుకుంటే ఉన్నతస్థాయికి చేరుకోవచ్చని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ఆదివారం స్థానిక వాల్మీకి కల్యాణ మండపంలో వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఆర్సీ అక్కులప్ప ఆధ్వర్యంలో వాల్మీకి అభ్యర్థులకు మోడల్ టెట్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బాగా చదువుకుని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ కొలువులు సాధించాలని ఆకాంక్షించారు. చదువుకున్న వారికి సమాజంలో మంచి గౌరవమర్యాదలు లభిస్తాయన్నారు. అనంతరం టెట్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచితంగా డీఎస్సీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వర్, ఎంపీఐ వరప్రసాద్, అమరావతి హాస్పిటల్ ఎండీ అంకే ముత్యాలన్న, తిమ్మయ్య, వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం కుమార్, పవన్ కుమార్, భాగ్యరాజు, ఈశ్వర్, శ్రీనివాసులు, రామాంజనేయులు, శంకర్, దాదులూరయ్య, మంజునాథ్, కుమారస్వామి పాల్గొన్నారు.

మోటారు మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలి


పీఏబీఆర్‌లో మోటారు మరమ్మతులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: పీఏబీఆర్ డ్యాంలో చేపడుతున్న మోటారు మరమ్మతులను నాణ్యతగా చేపట్టేలా చూడాలని ఇంజినీర్లను మేయర్ వసీం ఆదేశించారు. ఆదివారం డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యతో కలసి పీఏబీఆర్‌లో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ.. ఈనెల 3న ఒక మోటారు పని చేయలేదన్నారు. మరో మోటరు రిపేరీకి వచ్చిందన్నారు. మోటర్లు ఏర్పాటు చేసినటువంటి పంపుతో పాటు చిన్న చిన్న స్పేర్ పార్ట్స్ పోవడంతో తాగునీటికి అంతరాయం ఏర్పడిందన్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం కూడా నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులు, ఉద్యోగులు విధుల్లో ఉన్నారన్నారు. రిపేరీలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సోమవారం ఉదయానికంతా నగరంలోని కొన్ని ప్రాంతాలకు తాగునీరు అందే అవకాశం ఉందన్నారు. తాగునీటి అసౌకర్యానికి ప్రజలు సహకరించాలని కోరారు. డ్యాంలోకి తుంగభద్ర నీరు వస్తోందని.. నీరు రంగు మారే అవకాశం ఉందన్నారు. నగర ప్రజలు ఎటువంటి భయాందోళన చెందకుండా నీటిని కాచి తాగాలన్నారు. ఈఈ సూర్యనారాయణ, డీఈ చంద్రశేఖర్, ఏఈ బాబావలి పాల్గొన్నారు.

అటెండర్ మృతికి సంతాపం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో పని చేస్తున్న అటెండర్ అన్వర్‌బాషా ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం నగరంలోని అన్వర్‌బాషా ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 6న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి నాయకులు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణయ్య, కుల్లాయి స్వామి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు జీపు జాతా చేపట్టి విద్యార్థులతో మాట్లాడి అనేక సమస్యలను గుర్తించామన్నారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న కాస్మొటిక్ చార్జీలు, మెస్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కొనసాగించాలని కోరారు. విద్యార్థుల అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ హాస్టల్స్, జూనియర్ కళాశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల విద్యార్థుల సమస్యలు గుర్తించామన్నారు. సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి హనుమంతు, ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నాయకులు సమీర్, హర్ష, ఆనంద్, పవన్, నాని పాల్గొన్నారు.

పంపనూరుకు పోటెత్తిన భక్తులు


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి ఆకుపూజ అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేశారు. భక్తులు ఆలయ ప్రాగంణంలో తులసీ చెట్టు వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. మంజునాథ స్వామి, పార్వతీ దేవికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలి


పోస్టర్లు విడుదల చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం నిలుపుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. కార్పొరేట్ సంపదను పునఃపంపిణీ చేయాలన్నారు. విశాఖలో సెప్టెంబర్ 1వ తేదీ నరుంచి మూడు రోజుల పాటు జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలన్నారు. ఆదివారం స్థానిక సంఘం కార్యాలయం సమ్మేళనాల పోస్టర్లను నాయకులు విడదుల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచినప్పటి నుంచి వేల కోట్ల రూపాయలను కార్పొరేట్ కంపెనీలకు రుణమాఫీ చేసిందన్నారు. దేశంలో ఒక బడా కోటీశ్వరుడు తన కుమారుని పెళ్లికి రూ.5 వేలు కొట్లు ఖర్చు చేసింది ప్రజల సొమ్మే అన్నారు. ల్యాండ్ సీలింగ్ చట్టం మాదిరిగా సంపదకు సీలింగ్ విధించాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు నిలుపుదల చేసి గనులు కేటాయించేలా కేంద్రాన్ని ఒప్పించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను సవరించి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్రం వెనక్కి తీసుకోవాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు రూ.26 వేలు కనీసవేతనం ఇవ్వాలన్నారు. స్కీమ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆటో, హమాలీ, భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సమ్మేళనాల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, కార్య నిర్వాహక అధ్యక్షుడు కృష్ణుడు, ఉపాధ్యక్షులు గోవిందు, శ్రీనివాసులు, కార్యదర్శులు శ్రీనివాసులు, చిరంజీవి, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీ మాత జయంతి


గుత్తి రోడ్డు చౌడేశ్వరీ మాతకు బోనాల ఊరేగింపు


చౌడేశ్వరీ మాతను రథంపై ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: ఆషాఢమాస అమావాస్య రోజు వచ్చే చౌడేశ్వరీ మాత జయంతిని ఘనంగా జరుపుకున్నారు. గుత్తి రోడ్డులో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారి ఆలయానికి వందలాది మంది మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అలంకార సేవలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనల అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పుల్లా వెంకటేష్, శ్రీనివాసులు, బండారు కుమార్ స్వామి, శీన, గోవిందు, సంజీవులు తదితరులు పాల్గొన్నారు. అలాగే మొదటి రోడ్డు, తాడిపత్రి బస్టాండ్ తదితర చోట్ల చౌడేశ్వరీతల్లి జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఆవరణలో ఉన్న చౌడేశ్వరీ మాత ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 25 కేజీల పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించి, సాయంత్రం నగర వీధుల్లో ఊరేగించారు. జీజీహెచ్‌లోని ఆలయం నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా క్లాక్‌టవర్ వరకు ప్రత్యేక రథంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. అంతుకుమందు విశ్రాంత స్టాఫ్‌నర్సులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

కిషోర్ కుమార్‌కు ఘన నివాళి

అనంతపురం కల్చరల్: భారతీయ సినీ సంగీతానికి లెజండరీ గాయకుడు కిషోర్ కుమార్ అందించిన కళా సేవలు అభినందనీయమని పలువురు గాయకులు ఘనంగా కొనియాడారు. ఆదివారం స్థానిక మూడవ రోడ్డులోని ఘంటసాల భవన్‌లో సీనియర్ గాయకుడు పాలసముద్రం నాగరాజు నేతృత్వంలో పలువురు గాయనీ గాయకులు కిషోర్‌కుమార్‌కు పాత మధుర గీతాలతో ఘనంగా నివాళులర్పించారు. ముఖ్యంగా ఆచార్య సుధాకరబాబు, బాల మురళీకృష్ణ, రామాంజి, చంద్రమౌళి తదితరులు పాత సినిమాల్లోని హిందీ పాటలను అద్భుతంగా పాడి ఆకట్టుకున్నారు. అలాగే సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్తులో 'గాతా రహే మేరా దిల్' పేరుతో ఏర్పాటు చేసిన సంగీత విభావరిలో గాయనీ గాయకులు కిషోర్ కుమార్ పాటలతో అలరించారు. ఘంటసాల ఆరాధన సమితి గౌరవాధ్యక్షుడు ఘంటసాల రామయ్య ఆత్మీయ అతిథిగా విచ్చేసి కళాకారులతో పాటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీదేవి, పద్మజ, విజయలక్ష్మి, బాలమురళి, లక్ష్మీనారాయణ తదితరులతో కలిసి ఆలపించిన పాటలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. మేరి సప్‌నోంకి రాణిబాత్ ఆయే గీత్, అరె దివానో, వాదా కరో వంటి పాటలు ఆకట్టుకున్నాయి.